RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 147 | మే 04, 2025 | వెల : రూ.3-00



నేడు చెస్ సెలక్షన్స్

4లో..



## నీట్ పరీక్షకు అంత సిద్ధం

- అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవర్‌తో కలిసి పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

**వేద న్యూస్, నల్లగొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేడు(ఆదివారం)నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. శనివారం ఆమె నల్లగొండ జిల్లా కేంద్రం, అలాగే మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవర్ తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కేంద్రంలోని రామగిరిలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడ సౌకర్యాలను, బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కాగా నీట్ అండర్ గ్రాడ్యుయేట్ –2025 ప్రవేశ పరీక్షకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7 కేంద్రాలు నల్లగొండ జిల్లా కేంద్రంలోనే ఉన్నాయని, మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 4 పరీక్ష కేంద్రాలు, ఎన్జీ కళాశాలలో ఒకటి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఒకటి, కేంద్రీయ విద్యాలయలో మరొక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 2087 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను ఆమె తనిఖి చేయడమే కాక పరీక్ష కేంద్రాల సూపరింటిండెంట్లు,నోడల్ అధికారి, సంబంధిత శాఖల అధికారులకు మరోసారి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షరాసే అభ్యర్థులు ఉదయం 11 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె కోరారు. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్ష కేంద్రం ప్రధాన గేట్లను మూసివేయడం జరుగుతుందని పునరుద్ధరించారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు అన్నింటిని మరోసారి పరిశీలించుకోవాలని ముఖ్యంగా తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు ,తదితర అన్నింటిని పునః పరిశీలించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ చంద్ర పవర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాం రెడ్డి, నీట్ నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

**అక్రమ ధాన్యం రవాణాపై కఠిన చర్యలు**

4లో..



## ఎర్లీ బర్డ్‌ను సద్వినియోగం చేసుకోండి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ఎర్లీ బర్డ్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల ఏడవ తేదీ వరకు గడువు పొడిగించినందున ప్రాపర్టీదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడేతో కలసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, 5శాతం రిబెట్ (ఎర్లీ బర్డ్ ఆఫర్) వసూళ్ల, హీట్ వేవ్‌పై సమీక్షించి సమర్థ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎర్లీ బర్డ్ ద్వారా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రిబేట్ పొందవచ్చు అని, ఇప్పటివరకు బల్దియా వ్యాప్తంగా 25 కోట్ల రూపాయలు ఆస్తి పన్ను వసూలు అయిందన్నారు. ఇంక మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున నగర ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రిబేట్ పొందాలని కోరారు. ఎల్ఆర్ఎస్‌పై సమీక్షిస్తూ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించు గడువు నేటితో ముగుస్తుందని, ఇప్పటివరకు 30,500 మంది ప్లాట్ల క్రమబద్ధీకరణకు 170 కోట్ల రూపాయల ఫీజు చెల్లించారని తెలిపారు. అధికారులు ఫీజులు చెల్లించిన వారికి త్వరితంగా క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్లు జారీ చేయాలన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి శుక్రవారం హైదరాబాద్లో హీట్ వేవ్‌పై తీసుకోవాల్సిన చర్యలపై ఏక్షన్ ప్లాన్ విడుదల చేసి ఆదేశించిన విధంగా చర్యలు తీసుకోవాలని మేయర్ అన్నారు.

వేసవిలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలు రక్షించుకునేందుకు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని మేయర్ అధికారులను కోరారు. అధిక ఉష్ణోగ్రతలు వడగాల్పుల దృష్ట్యా ఇప్పటికే నగరవ్యాప్తంగా చలివేంద్రాలు, ముఖ్య కూడళ్ల వద్ద గ్రీన్ షెడ్లు బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి తోడుగా కుక్కలకు, పక్షులకు నీటి తొట్టెలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధిక ఉష్ణోగ్రత వల్ల ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అందుకుగాను కమర్షియల్ కాంప్లెక్స్ సెల్లార్లలో నిర్మాణాలు లేకుండా చూడాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకొని ఎలా నగర ప్రజల్లో అవగాహన కల్పించాలని, టపాకాయలు తయారు కేంద్రాల వద్ద, ఎక్కువ గన్నీ బ్యాగులు ఉన్నచోట్ల, ప్లాస్టిక్ సామాగ్రి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు.

అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి రెడ్ మార్క్ స్టిక్కర్ వేసి వర్షాకాలానికి ముందే ఆయా శిథిల గృహాలను తొలగించేలా ప్రణాళిక బద్ధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిఎఫ్ఓను ఆదేశించారు. జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే మాట్లాడుతూ సమన్వయంతో ఎండలు, వడగాలుల నుంచి ప్రజలు రక్షించుకునేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎర్లీ బర్డ్ ద్వారా పన్ను పై 5 శాతం రిబెట్ అవకాశం ఈ నెల 7వ తేదీతో ముగిస్తున్నందున ఆస్తి పన్ను చెల్లింపుదారులు చెల్లించేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సమీక్షలో అదనపు కమిషనర్ జోనా, ఉప కమిషనర్లు ప్రసన్న రాణి రవీందర్, డీఎఫ్ఓ శంకర్ లింగం టౌన్ ప్లానింగ్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

**వేద న్యూస్, శాయంపేట:**

కేంద్ర ప్రభుత్వము మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ముందుకు రావాలని ప్రజాసంఘాల నాయకులు వంగరీ సాంబయ్య, చింతల భాస్కర్, అంకేశ్వరపు ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శాయంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడాతు నక్సలైట్ల సమస్యను శాంతి భద్రత సమస్యగా చూడకుండా ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.మావోయిస్టుల పేరుతో ఈ దేశము ఉలవాసులైన ఆదివాసీలను అడవి నుండి బయటకు పంపే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని వారు మండిపడ్డారు.గత ప్రభుత్వాలు ఆదివాసీల సంక్షేమం కోసం ఎన్నో రకాలైన అడవి హక్కుల చట్టాలను తెచ్చినప్పటికీ వాటిని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కి ఆదివాసులపై యుద్ధాన్ని ప్రకటిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులో జాడ లేకుండా చేస్తానని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ప్రతిజ్ఞ పూనటం హేయమైన చర్య అని వారు అన్నారు.కేంద్ర ప్రభుత్వం పేదలను కొట్టి సంపన్నులకు ఊడిగం చేసే విధానాలను



ప్రోత్సహిస్తుందని వారు అన్నారు.రాజ్యాంగ హక్కులను పేద ప్రజలకు పూర్తిగా అందించినప్పుడు సామాజిక అసమానతలు లేకుండా ప్రభుత్వాలు రాజ్యాంగ ఫలాలను ప్రజల చెంతకు చేర్చినప్పుడు మావోయిస్టు సమస్య ఉండదని అన్నారు.ప్రభుత్వాలు పేద ప్రజలకు చెందాల్సిన ఎన్నో రకాలైన సంక్షేమ కార్యక్రమాలను అమలు జరపకుండా వారిని ఆకలితో మాడే విధంగా చేస్తున్నంతకాలము ప్రజల మనసులలో ప్రభుత్వాల పట్ల పూర్తిస్థాయి వ్యతిరేకత వ్యక్తం అవుతుందని వారు తెలిపారు.మావోయిస్టులను అణిచివేయాలని పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని వారు విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమమే పరమపదిగా పనిచేసినప్పుడు ప్రజల్లో సామాజిక అసమానతలు అంతరించి పోతాయని అప్పుడు సమాజంలో అందరూ సమానమైన భావన గుర్తిస్తారని అన్నారు.ప్రభుత్వాలు ప్రజా ఉపయోగ కార్యక్రమాలను నిర్వహించకుండా ప్రభుత్వాల తప్పులను ప్రశ్నించకుండా చేయడంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం మావోయిస్టులు సౌమ్య మానాన్ని పాటించి కాల్పుల విరమణను పూనుకోవాలని అన్నారు.ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాలలో పోలీసులు వికృతి చర్యలకు పాల్పడుతున్నారని అటవీ భూములను అక్కడి ఖనిజ సంపదను సంపన్నులకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మావోయిస్టు సమస్యను సామాజికపరమైన సమస్యగా గుర్తించి అసమానతలు తగ్గించి ప్రజలంతా ఒక్కటి అనే భావనను తీసుకు వచ్చినప్పుడు ఆ సమస్యకు నిజమైన పరిష్కారం చూపినట్టు అవుతుందని ప్రభుత్వం మావోయిస్టులు శాంతి చర్చలకు పూనుకోవాలని వారు కోరారు.

## ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

**వేద న్యూస్, నల్లగొండ :**



వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ, అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలో ఎవరు వడదెబ్బకు గురికాకుండా వైద్యారోగ్య శాఖతో పాటు, ఇతర శాఖల అధికారులు వడదెబ్బ నివారణపై వారి వారి ప్రణాళికకు అనుగుణంగా వేసవి తీవ్రత సమయంలో చేయదగినవి, చేయకూడని వాటి గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించేలా విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సాధారాణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ, తీవ్రమైన వేడిమితో కూడిన ఎండలు ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ ధరించడం, తలకు తువ్వాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయాలలో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు చేయవద్దని, చల్లదనాన్ని అందించే నీడ ప్రదేశాలలో ఉండాలని అన్నారు. సాధారణ సమయాలకంటే వేసవిలో ఎక్కువ మోతాదులో మంచి నీరు, మజ్జిగ, పళ్ళ రసాల వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, నీటిని ఎక్కువగా తీసుకోవాలని, సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని భుజించాలని, తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించాలని చెప్పారు. త్వరగా వడదెబ్బకు లోనయ్యే స్వభావం కలిగిన వారు విధిగా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆయా కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేడిమి తీవ్రత వల్ల వడదెబ్బకు లోను కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెప్పారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళల్లోనే పనులు చేసేలా చూడాలని, పని ప్రదేశాలలో తప్పనిసరిగా నీడనిచ్చేలా షామియానాలు, తాగునీటిని,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పి.హెచ్.సీలలో వైద్యాధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటూ, వడదెబ్బ నివారణ ఔషధాలు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తే, తక్షణ చికిత్స చేయడం జరుగుతుందని కలెక్టర్ శనివారం తెలిపారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వ్యతిరేక ప్రభుత్వం.!

## –తులసి ముఖేష్ ముదిరాజ్

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ప్రజలను మతం పేరుతో విడగొడుతుందని మీర్ పేట మునిసి పాలిటి క్లస్టర్ 2 అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుల గణన అసంపూర్తి, అశాస్త్రీయమని అన్నారు. శనివారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో కనీసం 50శాతం ఇండ్లలో సర్వే చేయలేదని వ్యాఖ్యానించారు 2010 సంవత్సరంలోనే కుల గణనకు అనుకూలమని భారతీయ జనతా పార్టీ చెప్పిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని కోరారు. 2010 సంవత్సరంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కుల గణనపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారని అప్పట్లో లోక్ సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సుష్మా స్వరాజ్ తాము కులగణనకు అనుకూలమని పేర్కొంటూ అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాశారని అప్పటి హెూం శాఖామంత్రి చిదంబరం కులగణను వ్యతిరేకించారని గుర్తు చేశారు. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అప్పటినుంచి జనాభా లెక్కల సమయంలో కులగణన చేస్తామని చెబుతూ వస్తున్నారని అప్పట్లో సుష్మా స్వరాజ్ ఇచ్చిన లేఖ ఆధారంగా ఇప్పుడు కులగణన నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. మోడీ ఘనతను కాంగ్రెస్ పార్టీ నాయకుల ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటని, తెలంగాణ,కర్ణాటక, రాష్ట్రాలలో జరిపిన కులగణనలో చిత్తశుద్ధి లేదని ఆ సర్వే శాస్త్రీయ పద్ధతిలో జరగలేదని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ విషయాన్ని తీసుకుంటే 150 డివిజన్లలో బీసీలకు 50 సీట్లు రిజర్వ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సీట్లలో 30 చోట్ల ముస్లింలే గెలిచారని అలాంటప్పుడు బీసీలకు న్యాయం జరిగినట్లు ఎలా అవుతుందని అన్నారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఎప్పుడు బీసీలకు న్యాయం చేయలేదని ఆరోపించారు. మోడీ ప్రధాని అయ్యాక తొలిసారి 2026 లో జన గణన జరిగిందని జనగణన చట్టం 1948 సవరించాల్సి అవసరం ఉంటుందన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాలలో సవరణ బిల్లు తీసుకొచ్చేందుకు భారతీయ జనతా పార్టీ సన్నద్ధమవుతుందని తులసి ముఖేష్ ముదిరాజ్ గుర్తు చేశారు.

---

### హాస్పిటల్ స్థలం కబ్జా ఆరోపణలపై

# మంత్రి స్పందించాలి

**వేద న్యూస్, కోదాడ :**



సూర్యాపేట జిల్లా కోదాడ ప్రభుత్వ దావఖాణాకు చెందిన స్థలం కబ్జాకు గురైందంటూ గత పది సంవత్సరాలుగా వస్తున్న ఆరోపణలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించి తక్షణమే విచారణకు ఆదేశించాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం విలేఖరులతో మాట్లాడుతూ ఆదివారం కోదాడకు వస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి కార్యక్రమాల్లో హాస్పిటల్ సందర్శన కూడా ఉన్నదని చెప్పారు.గత కొన్ని ఏండ్లుగా కోట్లాది రూపాయల విలువ చేసే హాస్పిటల్ స్థలం అన్యాక్రాంతమైనదని ఆధారాలతో సహా సామాజిక కార్యకర్తలు ఎన్నిమార్లు అధికారులకు అమాత్యులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందించిన నాథుడే లేడని ఆరోపించారు. ప్రస్తుతం కోదాడలో వంద పడకల హాస్పిటల్ కొరకు నూతనంగా భవనాలు నిర్మిస్తున్నందున అన్యాక్రాంతమైన స్థలాన్ని స్వాధీనం చేసుకొని హాస్పిటల్ లో కలిపితే ప్రజలకు విశాలమైన హాస్పిటల్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. కనుక మంత్రి తక్షణమే కబ్జా ఆరోపణలపై స్పందించాలని అన్యాక్రాంతమైన స్థలాన్ని స్వాధీనపర్చుకొని హాస్పిటల్ స్థలంలో కలపాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

---

### సింగర్ సోను నిగమ్

# 'పహల్గామ్' వ్యాఖ్యలు

**వేద న్యూస్, డెస్క్:**

ప్రముఖ బాలీవుడ్ గాయకుడు సోను నిగమ్ బెంగళూరులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా చిక్కుల్లో పడ్డారు. నగరంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో ఏప్రిల్ 25–26 తేదీల్లో జరిగిన సంగీత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ఓ ప్రేక్షకుడు పదే పదే కన్నడ పాట పాడాలని గట్టిగా అరిచాడు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన సోను నిగమ్, ఆ యువకుడి ప్రవర్తనను కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడితో పోలుస్తూ హిందీలో వ్యాఖ్యానించారని ఆరోపణలు వచ్చాయి. "అతను 'కన్నడ, కన్నడ' అని అరిచిన తీరు నాకు నచ్చలేదు.

---

# నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## - కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



నేడు ఆదివారం నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రన్స్ టెస్ట్) అండర్ గ్రాడ్యుయేషన్ –2025 ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం నీట్ పరీక్ష కేంద్రాలైన దూరాజ్ పల్లి లోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల, ఇమంపేట లోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల, టి జి ఎస్ డబ్ల్యు ఆర్ స్కూల్, జూనియర్ కళాశాల ఇమంపేట అలాగే సూర్యాపేట పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల లలో ప్రవేశ పరీక్ష ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలలో 890 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. నీట్ ప్రవేశ పరీక్ష –2025 మే 4 ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00గంటల వరకు జరుగుతుందని అభ్యర్డుల బయోమెట్రిక్ తీసుకుంటున్నందున ఉదయం 11:00 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని మధ్యాహ్నం 1:30 గంటలకు కచ్చితంగా పరీక్ష కేంద్రాల గేట్లను మూసి వేయటం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలు తప్పకుండా పాటించాలని,అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వెళ్ళేటప్పుడు అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కోసం ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు లాంటి ఎదో ఒక్క గుర్తింపు కార్డు తీసుకొని రావాలని రీసెంట్ పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, పోస్ట్ కార్డు సైజ్ ఫొటో తీసుకొనిరావాలని తెలిపారు. అధికారులు అందరు సమన్వయము చేసుకుంటూ నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగేలా చూడాలని సూచించారు.పరీక్ష సమయంలో అన్ని పరీక్ష కేంద్రాలకు విద్యుత్ అంతరాయము లేకుండా విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేసారని, త్రాగునీరు,హెల్త్ సెంటర్ ఏర్పాట్లు చేస్తున్నట్లు, పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయనున్నట్లు తెలిపారు. ఏమైనా అభ్యర్థులకి సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 1433 ఫోన్ చేయాలనీ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎ ఎస్పి నాగేశ్వరావు, ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్లు శ్యాం సుందర్ రెడ్డి, కృష్ణయ్య, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ జయలత, సెంటర్ సూపర్ టిడెంట్లు రమేష్, పద్మ, వినోద, యాదయ్య,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్లకు లక్ష తులసి దళార్చన

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



పునర్వసు నక్షత్రం, వైశాఖమాసం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పుట్టినరోజులు పురస్కరించుకొని శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత బజన మందిరంలో దేవాలయ అర్చకులు ధరూరీ సింగరాచార్యులు, రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా మాస కళ్యాణం తో పాటు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్లకు లక్ష తులసి దళార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులుపాల్గొని శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి అష్టోత్తర పారాయణాన్ని సామూహికంగా నిర్వహించగా మందిర అర్చకులు లక్ష తులసి అర్చన పూజలు నిర్వహించారు. అంతకు ముందు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాల కు పంచామృతములతో అభిషేకం నిర్వహించి నూతన పట్టు వస్త్రములు అలంకరింప జేసీ నిర్వహించారు.జైశ్రీరామ్ అంటూ ప్రతి ఒక్కరు శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి వారలను కీర్తిస్తూ అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, కమిటీ సభ్యులు సోమ సుమన్, షీలా శంకర్, కక్కిరేణి విజయ్, వరగాని వెంకటేశ్వర్లు, వాస కృష్ణ, వెంపటి అప్పారావు' చిత్తలూరి శ్రీధర్ రావు, చల్లా సత్యనారాయణ, జక్కుల గిరి, రావుల నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావు, చిల్లంచెర్ల సోమేశ్, కొండా మాదవి, చిత్తలరీ మాధవి, చిత్తలూరి అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

---

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి

**వేద న్యూస్, కోదాడ/చిలుకూరు :**



చిలుకూరు మండలం, రామాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సెలక్షన్ లో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. ప్రభుత్వ అధికారుల తీరును నిరసిస్తూ జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ఇండ్లు మంజూరు చేసేంతవరకు కలెక్టరేట్ ఎదురుగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది.ఇళ్ల ఎంపికలో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వని అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్ష కొనసాగుతుందని తెలియజేస్తున్నామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు.

---

# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన కన్నం లాస్య

**వేద న్యూస్,శాయంపేట :**



కొంత మంది విద్యార్థులు అత్యంత చిన్న వయసులో అపారమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తుంటారు. వారి అద్భుతమైన ప్రతిభ ఎవరినైనా ఆశ్చర్యంలో ముంచెత్తడం మే కాక కట్టిపడేస్తాయి. అంతేగాక వాళ్ళని చూడగానే పిట్ట కొంచెం కూతగనం అనే సామెత గుర్తుకు రాక మానదు. అలాంటి ప్రతిభాపాటాలను ప్రదర్శిస్తోంది ఈ విద్యార్థిని. ఈ విద్యార్థిని చిన్నవయసులో కూచిపూడి నృత్యం చేసి శభాష్ అనిపించుకుంటుంది. ఈ విద్యార్థిని శాయంపేట మండలానికి చెందిన కన్నం చంద్రశేఖర్ పార్వతీల కుమార్తె కన్నం లాస్య 2023 నా జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షణ సంస్థ కృషి నృత్య అకాడమీ వారు నిర్వహించిన 4218 మంది ప్రదర్శించిన కూచిపూడి నృత్యంలో భాగంగా కన్నం లాస్యకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించి. ఈ అవార్డు రవీంద్ర భారతి మినీ హాల్లో తెలంగాణ భాష సంస్కృతి సంచాలకులు మామిడి హరికృష్ణ ద్వారా ఈ అవార్డు అందుకున్నారు.

---

# నేడే ప్రభుత్వ పథకాల సంబరాలు

## - ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ మిర్యాలగూడ నందు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవుగా తీసుకెళ్లాలని భాగంతో ఎన్ఎస్పి క్యాంపు మైదానం, మిర్యాలగూడ నందు సంబరాలు ఆదివారం నిర్వహించడం జరుగుతుంది.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లో ప్రచారం చేసే క్రమంలో భాగంగా స్థానిక మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మే నాలుగవ తేదీ సాయంత్రం మిర్యాలగూడ ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ లో నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో ప్రముఖ సింగర్ మంగ్లీ బృందం ఆటపాటలతో అలరించబోతున్నారని,నేడు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పుట్టినరోజు కూడా కావడం మరియు ప్రభుత్వ పథకాల సంబరాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని,ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని పట్టణంలోని 47 వ వార్డు, ఇస్లాంపుర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎంఏ హాలీం ఒక ప్రకటనలో తెలిపారు.

---

# ప్రధాని మోదీతో మొదటిసారి ఒమర్ అబ్దుల్లా భేటీ



- శనివారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో సమావేశం
- పహల్గామ్ ఉగ్రదాడి సహా పలు అంశాలపై సంప్రదింపులు
- జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా దేశ రాజధాని ఢిల్లీలో

**వేద న్యూస్, డెస్క్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి అధికారిక నివాసంలో వీరిద్దరి మధ్య భేటీ జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశం సుమారు 30 నిమిషాల పాటు కొనసాగింది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడితో సహా పలు కీలక అంశాలపై ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా చర్చించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడి ఘటన అనంతరం నెలకొన్న పరిస్థితులు, భద్రతాపరమైన అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. గత నెల 22వ తేదీన పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ విషాద సంఘటన తర్వాత ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా నేరుగా సమావేశం కావడం ఇదే మొదటిసారి.

# సామాన్యుడికి అందని ద్రాక్ష ఆవకాయ

వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మామిడికాయ పచ్చడిని ఇష్టపడని వారు ఉండరు. అయితే గత రెండు సంవత్సరాలుగా పచ్చడి సరుకుల ధరలు మంట పుట్టిస్తున్నాయి. సాంబారు పప్పన్నమే కాదు పచ్చడి మెతుకులు సైతం సామాన్యులకు భారంగా తయారయ్యాయి. ఏ సరుకు కొనాలన్నా జేబులు ఖాళీ అవుతున్నాయి. గతంతో పోలిస్తే పచ్చడి సరుకులు ధరలు సుమారు 30 నుండి 40 శాతం వరకు పెరిగాయి. పేదల నుంచి ధనవంతుల వరకు నోరూరించే మామిడికాయ ఆవకాయ లేని ఇల్లు సర్వ సాధారణంగా ఎక్కడా కనిపించదు. పేదలకు అయితే పచ్చడి మెతుకులే పరమాన్నంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో వేసవికాలం సీజన్ వచ్చిందంటే చాలు మామిడి కాయలతో ఆవకాయ ఊరకాయ పచ్చళ్ళ పైనే అందరి దృష్టి ఉంటుంది. వేసవి సీజన్ లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాలలో మాత్రమే కాకుండా వివిధ రాష్ట్రాలలో మామిడికాయ పచ్చడి అంటే ఇష్టపడి తింటారు. గ్రామీణ ప్రాంతాలలో తప్పకుండా సీజన్ వారీగా మామిడికాయ పచ్చళ్ళు పెడతారు. అయితే ఇప్పుడు మామిడికాయ పచ్చళ్ళు పెట్టాలంటే తలకు మించిన భారంగా మారింది. అన్ని ధరలు పెరిగి పచ్చళ్ళు పెట్టాలంటే రెట్టింపు ఖర్చు కావడంతో "వామ్మో ఆవకాయ" అంటున్నారు. తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో నలుగురు సభ్యులు ఉండే ఒక కుటుంబం ఏడాది వినియోగానికి సగటున 10 కిలోల వరకు మామిడికాయ పచ్చళ్ళు తయారు చేసుకొని నిలువ పెట్టుకోవడం



ఆనవాయితీ. కుల మతాలకు అతీతంగా ధనిక, పేద, అనే తారతమ్యం లేకుండా అందరూ మామిడికాయల పచ్చడి పెట్టాల్సిందే. అయితే ఈ పచ్చడి తయారీకి ప్రధానమైన మామిడికాయలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు మాత్రం సామాన్యులను భయపెడుతున్నాయి. పచ్చడి తయారీకి అవసరమైన సరుకుల ధరలన్నీ మండిపోతున్నాయి. పచ్చడి పెట్టాలంటే వేల రూపాయలు చేతులలో పెట్టుకోవలసిన పరిస్థితులు ఏర్పడినాయి.

– రెండింతలు పెరిగిన ధరలు

సాధారణంగా మార్చిలో అపరాల పంటలు దిగుబడి రావడం వల్ల సరుకుల ధరలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ సమయంలో సామాన్యులు మధ్యతరగతి ప్రజలు ముందుగా అపరాలు మసాలా సరుకులు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి జాగ్రత్త చేసుకోవడం ఆనవాయితీ. కానీ నేడు అపరాలు మసాలా దినుసుల ధరలు గతంలో కంటే అధికంగా పెరగడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. పచ్చడి ధరలు ఈ వేసవిలో రెండింతలు పెరిగాయని వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు పచ్చడి మామిడికాయల ధరలు చుక్కలు అంటుతున్నాయి. దేశవాళీ మామిడి చెట్లు పూత దశలో మంచు వల్ల పూత రాలిపోగా మార్చిలో గాలి దుమ్ములకు ఉన్న కాస్త మామిడికాయలు రాలిపోయాయి. దీనితో కాయలు దొరకడం గగనంగా మారింది మరోవైపు ఎండుమిర్చి ధర ఘాటు ఎక్కుతోంది గతంలో రిటైల్ మార్కెట్లో పచ్చడి కాయ కేజీ 350 ఉండగా ప్రస్తుతం 650 పలుకుతుంది. అదే విధంగా పచ్చడి కారం పౌడర్ కేజీ 250 ఉండగా ప్రస్తుతం 650 కి అమ్ముతున్నారు. ఇక పచ్చళ్ల తయారీకి సాధారణంగా నువ్వుల నూనె వినియోగిస్తారు. మరికొందరైతే వేరుశనగ నూనె కూడా ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో మామిడికాయ పచ్చడికి సంబంధించి ప్రత్యేకమైన వేరుశనగ నూనె లీటర్ ధర 500 రూపాయల వరకు పలుకుతోంది. నువ్వుల నూనె ధర గత ఏడాదితో పోలిస్తే 600 రూపాయల పై మాటే. అలాగే నువ్వుల నూనెతో పాటు ఆవపిండి, మెంతులపూడి, కారం, ఉప్పు, వంటి సరుకుల ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. వీటిలో మిరపకాయ రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మిరపకాయల ధరలు ఘాటెక్కాయి. కేజీ మేలు రకం 750 రూపాయలు పలుకుతుంది. ఇక కారంపొడి ధర అయితే బ్రాండెడ్ కారం కేజీ ప్రస్తుతం ఎనిమిది వందల పది రూపాయలు ఉంది. 100 కాయల పచ్చడి పెట్టాలంటే మూడున్నర నుంచి నాలుగు కేజీల కారం అవసరం అంటే ఒక్క కారం ఖర్చే 3000 రూపాయలు అవుతుంది. అలాగే ఆవపిండి కూడా మూడు కేజీల వరకు అవసరం. కేజీ 250 రూపాయలు పలుకుతుంది. ఈ లెక్కన మూడు కేజీలకు 800 రూపాయలు అవసరం అవుతాయి. ఈ పరిస్థితులలో ఈ ఏడాది మామిడికాయల పచ్చడి అంటే ముఖ్యంగా పేదలు సామాన్యులు జారెత్తిపోతున్నారు.

– పచ్చడి ప్రియుల పై తీవ్ర ప్రభావం తీవ్ర ప్రభావం

మామిడి పచ్చడి వేసవిలోనే ఎక్కువగా పెట్టే విషయం అందరికీ తెలిసిందే. ఎక్కువమంది సంవత్సరానికి సరిపడా పచ్చడి నిలువ చేసుకుంటారు. ఈసారి పచ్చడి సరుకుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సంవత్సరానికి సరిపడా పెట్టుకునే పరిస్థితి లేదంటున్నారు.

## ఆపిల్‌ను వెనక్కినెట్టిన మైక్రోసాఫ్ట్

వేద న్యూస్, డెస్క్ :

టెక్నాలజీ ప్రపంచంలో సుదీర్ఘ కాలంగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆపిల్‌ను వెనక్కి నెట్టి, సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలలో కనబరుస్తున్న అసాధారణ వృద్ధి మైక్రోసాఫ్ట్‌కు ఈ ఘనతను సాధించిపెట్టింది. శుక్రవారం నాడు అమెరికా స్టాక్ మార్కెట్లు ముగిసే సమయానికి మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (మార్కెట్ విలువ) 3.235 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో, ఐఫోన్ తయారీదారు ఆపిల్ మార్కెట్ విలువ 3.07 ట్రిలియన్ డాలర్ల వద్ద ముగిసింది. దీంతో టెక్ ప్రపంచంలో మైక్రోసాఫ్ట్ అగ్రపీఠాన్ని కైవసం చేసుకుంది. ఈ జాబితాలో ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా 2.76 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో మూడో స్థానంలో నిలిచినట్లు 'ది ఇన్ఫర్మేషన్' న్యూస్‌లెటర్ నివేదించింది. గత గురువారం విడుదలైన మార్చి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలను మించిపోవడంతో మైక్రోసాఫ్ట్ షేర్లు భారీగా పెరిగాయి. తమ క్లౌడ్ సేవలు, ఏఐ ఉత్పత్తులకు డిమాండ్ స్థిరంగా కొనసాగుతోందని కంపెనీ సీఈఓ పెట్టుబడిదారుల సమావేశంలో హైలైట్ చేశారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై మైక్రోసాఫ్ట్ వ్యూహాత్మకంగా దృష్టి సారించడంపై పెట్టుబడిదారులలో విశ్వాసం పెరుగుతోందని ఈ ఏడాది కంపెనీ షేర్ల పనితీరు సూచిస్తోంది. 2015 అక్టోబర్‌లో కూడా అజూర్ క్లౌడ్ వ్యాపారం ఆదాయం రెట్టింపు కావడంతో మైక్రోసాఫ్ట్ షేర్లు 10 శాతం పెరిగిన విషయాన్ని ఇన్వెస్టోపీడియా గుర్తుచేసింది. మరోవైపు, ఆపిల్ కూడా తొలి త్రైమాసికంలో ఐఫోన్ అమ్మకాల జోరుతో అంచనాలను మించిన ఫలితాలను ప్రకటించింది. అయినప్పటికీ, వాణిజ్య సుంకాల (టారిఫ్‌లు) రూపంలో కంపెనీ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది.

## కేసీఆర్ పేరు పెట్టేందుకు ఎలాంటి పర్మిషన్ లేదు..!

వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :

నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో గల మినీ రవీంద్ర భారతీ పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక నేతలు నాసిరకంగా చేపట్టి కోట్ల బిల్లులను ఎత్తింద్రని. ఇందుకు నిదర్శనమే ఇటీవల ఏసీల స్థానంలో కూలర్ల వినియోగమేనని మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక మినీ రవీంద్రభారతి లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2006లో నాటి ఎంపీ జైపాల్ రెడ్డి నిధులతో శంకుస్థాపన చేసి అనంతరం నాటి ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి నిధులు రూ. 1.30 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన రూ. 9 కోట్లను టీఎఫ్ యూఐడీసీ నిధులతో నిర్మాణం చేశారని, అయితే మొదట కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థకు బిల్లులు రాకుండా చేసి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు తన బినామీలకు ఆ కాంట్రాక్ట్ ని అప్పగించారన్నారు. ఇష్టం వచ్చినట్లు ఎస్టిమేట్లు పెంచి నాటి మున్సిపాలిటీ డీఈ సాయిలక్ష్మి సహకారంతో దొంగ బిల్లులను డ్రా చేసి నాసిరకం పనులను చేశారని ఆరోపించారు. అందుకు నిదర్శనంగానే ఇటీవల కళాభారతిలో ఓ టీచర్ పదవి విరమణ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సభలో ఏసీలు పని చేయలేదని, కూలర్లతోనే సభను కొనసాగించారని చెప్పారు. కళాభారతి పై కేసిఆర్ పేరు ఏర్పాటుకు తీర్మానం లేదన్నారు. దీంతో మున్సిపల్ ఆఫీసర్లు కేసీఆర్ పేరును తొలగించారని చెప్పారు. ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తో కలిసి అభివృద్ధి పనులను చేస్తుంటే, బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే పై అసత్య ప్రచారాలకు దిగుతున్నారని మండిపడ్డారు. క్వాలిటీ లేని పనులతో మినీ రవీంద్ర భారతి పనులను కంప్లీట్ చేసిన విధానంపై పూర్తిస్థాయి



విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకునే విధంగా పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ బెజ్జం సాయి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, పాతూరు ప్రసాద్, బండి యాదగిరిరెడ్డి, రుణాల్ రెడ్డి, రవి నాయక్, కొమ్మన నాగలక్ష్మి, పందిరి అనిత తదితరులు ఉన్నారు.

## సూక్ష్మ కళాత్మకతకు మారుపేరు నరేష్ చారి

వేద న్యూస్, కోదాడ :

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వెగ్గలం నరేష్ చారి శనివారం ప్రపంచ పత్రికా దినోత్సవం సందర్భంగా పెన్సిల్ మొనపై పత్రికా ప్రతిమలను ఆవిష్కరించి తన కళాత్మకతను చాటుకున్నాడు. నరేష్ చారి గతంలో పప్పు గింజలు, బియ్యపు గింజలు, చాక్పీస్, పెన్సిల్ మొనల లాంటి సూక్ష్మ వస్తువులపై అనేక అద్భుత కళాఖండాలు, సినీ నటుల స్వాతంత్ర్య సమరయోధుల ప్రతిమలు చెక్కి పలువురి మన్ననలను పొందాడు. ప్రభుత్వం ప్రొత్సహిస్తే సూక్ష్మకళలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకవస్తానని నరేష్ చారి అన్నారు.



## ఘనంగా శ్రీ కల్యాణ వెంకటేశ్వర తిరుకల్యాణమహోత్సవం



వేద న్యూస్, కోదాడ :

శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి స్వామివారి 20 వ తిరుకల్యాణమహోత్సవం సందర్భంగా రామాపురం గ్రామంలో 2025 మే 10,11న రెండు రోజులు ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు నిర్వహించుటకు ముఖ్య అతిథిగా చిలుకూరు మండలం ఏ ఎస్సై వెంకటేశ్వర్లు కరపత్రాన్ని విడుదల కార్యక్రమం లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కబడ్డీ పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు ఇనుగుర్తి వెంకటరమణ చారి, పాయలి కోటేశ్వరరావు, రాయబారపు వెంకటేశ్వర్లు వేమూరి నాగేశ్వరావు, నల్లబోతు సత్యనారాయణ, నిగిడాల వీరయ్య, తిపిరిశెట్టి శ్రీను, మీసాల గంగ లింగయ్య, నరసింహారావు, మరియు గ్రామ పెద్దలు సమక్షంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది అని అన్నారు.

## మేలుకోకపోతే ముంపే...!

వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అది. అది వరద నీటి కాలువ (నాలా) సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వరదతో పాటు మురుగు సైతం అందులో నుంచే పారుతుంది ఆ కాలువ ఉండే స్థలం వివాదాస్పదంగా మారడంతో కాలువే కనబడకుండా పోయింది. మురుగు నీరు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో పలు కాలనీలకు పెద్ద సమస్యగా మారింది. సమస్యను పరిష్కరించమని విన్నవిస్తున్న ఫలితం ఉండడం లేదు ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక అధికారి కమిషనర్ వచ్చిన సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఇది బడంగ్ పేటలో నెలకొన్న వరద నీటి కాలువ సమస్య.

– కాలనీవాసుల అవస్థలు

బడంగ్ పేట నుంచి నాదర్గుల్ వెళ్లే రహదారిపై కల్వర్టు ఉంది అక్కడి నుంచి దిగువనున్న వరద కాలువ విషయంలో కొంతకాలం నుంచి వివాదం కొనసాగుతుంది. కాలువలు మూసివేయడంతో ఎగువ వచ్చే మురుగు దిగువకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.




ఫలితంగా శివ సాయి నగర్ వెంకటేశ్వర కాలనీలు సీతారామ కాలనీ చంద్రారెడ్డి నగర్ చదివితర కాలనీలో నుంచి వచ్చే మురుగు వెళ్లక ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు కాలువ విషయంలో ఇరువర్గాలతో మాట్లాడి కాలువలు ఏర్పాటు చేయించాలని చాలా రోజులుగా స్థానికులు ప్రజాప్రతినిధులు అధికారులను వేడుకుంటున్నారు. కాల్వకు సమీపంలో ఉన్న శివ సాయి నగర్ కాలనీ నుంచి మురుగు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో వారు ఇండ్ల ముందు గుంతలను తొవ్వుకున్నారు.

– మేలుకోకపోతే ముంపే

సమస్య పరిష్కరించేందుకు స్థానిక శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, కమీషనర్ సరస్వతి ఇలా అందరూ వచ్చారు కానీ సమస్యకు మాత్రం పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే వరద ఇక్కడ నుంచే వెళుతుంది కాలువ మూసివేసి ఉండడంతో భారీ వర్షాలు పడితే వచ్చే వరద వెళ్లలేక అనేక ఇండ్లు ముంపుకు గురి అయ్యే ప్రమాదం ఉంది. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వివాదాన్ని ముగించి కాలువను తెరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

## భారత్ నిర్మాణాలు చేపడితే ధ్వంసం చేస్తామని హెచ్చరిక

వేద న్యూస్, డెస్క్ :

సింధూ నదీ జలాల ఒప్పందం విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. సింధూ నదీ జలాలను భారత్ మళ్లించేందుకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వాటిని ధ్వంసం చేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ హెచ్చరించారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ వాటా నీటిని మళ్లించేందుకు భారత్ చేసే ఏ ప్రయత్నమైనా తమ దేశంపై దాడిగా పరిగణిస్తామని ఆయన అన్నారు. "ఒకవేళ భారత్ అలాంటి నిర్మాణ ప్రయత్నం చేస్తే, పాకిస్థాన్ ఆ నిర్మాణాన్ని నాశనం చేస్తుంది" అని ఆసిఫ్ పేర్కొన్నారు. ఇటీవల పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ దాడి తర్వాత, దశాబ్దాల నాటి సింధూ జలాల ఒప్పందం అమలును భారత్ పక్కన పెట్టే ఆలోచనలో ఉంది. భారత్ ఒకవేళ ఒప్పందాన్ని నిలిపివేస్తే, అది పాకిస్థాన్ వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని, దీర్ఘకాలికంగా నష్టం వాటిల్లుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాక్ రక్షణ మంత్రి చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది.

వేద న్యూస్

ఆదివారం మే 04, 2025

# అక్రమ ధాన్యం రవాణాపై కఠిన చర్యలు

■ డిఎస్పీ రాజశేఖర్ రాజు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



ఇంటిగ్రేటెడ్ చెక్ పాయింట్ అయిన వాడపల్లి చెక్ పోస్ట్ వద్ద వాడపల్లి పోలీసులు ఏడు ధాన్యం లారీలను పట్టుకున్నారు. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పాత వ్యవసాయ మార్కెట్ నందు డిఎస్పి రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. గత 20 రోజుల నుండి కొన్ని వందల దాన్యం లారీలను ఆంధ్ర నుంచి వస్తుండగా వాటిని రిటర్న్ పంపించడం జరిగిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చేటువంటి బోనస్ కు ఆశపడి దళారులు ఇది అదనుగా చేసుకొని దాచేపల్లి నుండి మఠంపల్లి మీదుగా తెలంగాణ ప్రాంతంలోకి రాత్రిపూట లారీలతో ధాన్యమును తరలిస్తున్నారు. అక్రమంగా ధాన్యం తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అక్రమంగా ధాన్యం లారీలను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని,జిల్లా ఎస్పీ సూచన మేరకు దాన్యం చెడిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఎవరైతే రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించారో ఆ ధాన్యాన్ని తిరిగి వారికి అప్పగించేట్లుగా చర్యలు తీసుకొని రైతులను మోసం చేస్తున్న దళారులపై కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు. 7 లారీలు ఒక ఏసర్ బండి స్వాధీనం చేసుకున్నామని సుమారు 200 బస్తాల ధాన్యము ఉండొచ్చని ఆయన అంచనా వేశారు.ఆంధ్రాలోని ఒంగోలు ప్రకాశం నరసరావుపేట జిల్లాల నుంచి మిర్యాలగూడ చుట్టుపక్కల మిల్లులకు ధాన్యాన్ని సరఫరా చేస్తున్నట్లుగా ఎంక్వయిరీలో తేలిందని సుమారు 14 మంది నిందితులను గుర్తించామని,ఇంకా పూర్తి ఇన్వెస్టిగేషన్ చేసి ప్రతి దళారులపై కేసులు ఫైల్ చేస్తామన్నారు. అక్రమంగా ధాన్యం ట్రాన్స్పోర్ట్ చేయడం నేరమని అలాంటి అక్రమార్కులకు కేసులు ఫైల్ చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. రూరల్ సీఐ పిఎన్డి ప్రసాద్ ఎస్సై లక్ష్మయ్య, అడవిదేవులపల్లి ఎస్సై శేఖర్ లతోపాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహ ఆధ్వర్యంలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడి బీసీలకు రావలసిన రిజర్వేషన్ల ను జనాభా దామాషా ప్రకారం వర్తింపజేయాలని ఉద్దేశంతో దేశవ్యాప్తంగా జనగణన లో కులగణన కూడా చేస్తామని చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం పట్ల కృతజ్ఞత భావంతో వారి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా బీసీల తరఫున ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు అభినందనలు తెలియజేస్తూ బీసీలంతా వారికి రుణపడి ఉంటారని అన్నారు. ప్రధాని మోడీ కులగణన నిర్ణయం తీసుకోవడం దేశంలో ఏ రాజకీయ పార్టీ ఘనత కాదని, గత 30, 40 సంవత్సరాల నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని బీసీ సంఘాలన్నీ నిరంతరం అధికారంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన పోరాటాలు చేస్తూ ఢిల్లీలో జంతర్ మంతర్ లో ధర్నాలు, పార్లమెంటు ముట్టడిలు చేస్తూ జాతీయస్థాయిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్ని రాష్ట్రాల బీసీ సంఘం నాయకులతో కమిటీలు ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో మేమెంతో మాకంత అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలు, ధర్నాలు అనేకసార్లు ఢిల్లీ స్థాయిలో చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి సాధించుకున్న ఘనత శ్రీనివాస్ గౌడ్, బీసీ నాయకులదే అని అన్నారు. ఇప్పటివరకు 78 సంవత్సరాల భారత స్వాతంత్ర పాలనలో పాలకులు బీసీలను ఓట్లు వేసే యంత్రాలు లాగానే చూశారు. కానీ బీసీల సంక్షేమాన్ని అభివృద్ధిని పట్టించుకోక పోగా ఉక్కు పాదంతో అన్చివేసినారనీ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా ఐక్యంతో ఉండి తమకు రావలసిన రిజర్వేషన్లు, చట్టసభల్లో, విద్యా ఉద్యోగాలలో, స్థానిక సంస్థలల్లో 50శాతం రిజర్వేషన్లు, బీసీల రాజ్యాధికారం వచ్చేవరకు నిరంతరం ఉద్యమించాలని కోరారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకులు కంచుకొమ్ముల వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకన్న యాదవ్, బండపల్లి శ్రీనివాస్ గౌడ్, తన్నీరు వాసుదేవ్, కోడి లింగ యాదవ్, మమతపురం వెంకటేశ్వర్లు, ఎలగందుల వెంకటేశ్వర్లు, నాగేందర్, రామచందర్ యాదవ్, రాములు, కృష్ణ, శ్రీను, భరత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కేతేశ్వర్ మహారాజ్ సేవలు చిరస్మరణీయం

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



యువతకు సనాతన ధర్మ విలువలు నేర్పించడంలో కేతేశ్వర మహారాజ్ సేవలు చిరస్మరణీయమని భారతీయ జనతా పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందేల శ్రీరాములు యాదవ్ అన్నారు. శనివారం నాడు మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రజాభవన్ లో భాగ్యనగర్ సికింద్రాబాద్ రాజ్ పురోహితుల సమాజం ఆధ్వర్యంలో శ్రీ కేతేశ్వర మహారాజ్ పుణ్యస్థితి సందర్భంగా నిర్వహించిన సమరోహంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందేల శ్రీరాములు హాజరై మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి వారి సేవలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అందేల శ్రీరాములు మాట్లాడుతూ కేతేశ్వర్ మహారాజు ప్రజలకు ధార్మిక మార్గదర్శకులుగా నిలిచారని వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, తదితర హిందూ గ్రంథాలలో ఆయనకు విశేష పాండిత్యం ఉండేదని తెలిపారు. సమాజంలోని యువతకు సనాతన ధర్మ విలువలు నేర్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారని సమ సమాజ ఐక్యత కోసం వారు అనేక గ్రామాలలో పట్టణాలలో సత్సంగాలు, సామూహిక పూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి సామాజిక బంధాన్ని బలపరిచారని అన్నారు. సమాజంలో సేవ చేయడమే లక్ష్యంగా పనిచేశారని కొనియాడారు. మహారాజ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అనేక మంది యువకులు ధార్మిక మార్గంలో అడుగులు వేశారని వారి సేవలు జీవన మార్గం రాజ్ పురోహిత సమాజానికే కాదు భారతీయ సంస్కృతికి కూడా గొప్ప ఆస్తి అని ఈ సందర్భంగా కేతేశ్వర్ మహారాజుని స్మరించుకోవడం అందరి బాధ్యతగా భావించాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, రాజ్ పురోహిత సమాజ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పరిశుద్ధ కార్మికుల సమ్మె

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు ఔట్సోర్సింగ్ గత రెండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని సమ్మెకు పిలుపునిచ్చారు. ఉదయం విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించారు. అనంతరం కూరగాయల మార్కెట్ లో బిక్షటన చేసిన మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుండి మార్కెట్ పాత బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్మికులు మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని కార్మికుల ఇల్లు గడవడం కష్టంగా ఉందని అన్నారు. గతంలో ఏళ్ళు నెలల బకాయిలను చెల్లించాలని రెండు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్ డిమాండ్ చేశారు. ప్రతి కార్మికులు రోజు రెండు షిఫ్టు లలో పనిచేస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు రావడానికి మా మున్సిపల్ కార్మికుల ఎనలేని సేవలు చేస్తున్నారని అన్నారు. పెండింగ్లో ఉన్న బకాయిలు రెండు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సమ్మెను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఉస్మాన్, మున్సిపల్ లేబర్ యూనియన్ అధ్యక్షులు బర్ల లక్ష్మణ్ కార్మికులు పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరిన మాజీ ఉపసర్పంచ్ మంచాల శాంతయ్య

**వేద న్యూస్, జడ్చర్ల :**



రాజాపూర్ మండల్ చోక్కంపేట్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మంచాల శాంతియ్యకి మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం జరిగింది. పార్టీలో చేరిన కొద్ది రోజుల్లోనే పార్టీలో ఇమడ లేక సొంత గూటికి బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి ఆధ్వర్యంలో మాజీమంత్రి వర్యులు డా. సి.లక్ష్మారెడ్డి నాయకత్వములో పనిచేయడానికి తిరిగి చోక్కంపేట్ మాజీ ఉప సర్పంచ్ మంచాల శాంతయ్య, యువ నాయకులు మంచాల నర్సింహా ఇద్దరు కలిసి గ్రామ సర్పంచ్ మంచాల కృష్ణయ్య, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు అవులమంద యాదగిరి, సమక్షంలో గులాబి కండువాలు కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంచాల కృష్ణయ్య, కుత్నేపల్లి సర్పంచ్ సేవ్యనాయక్, మాజీ ఉపసర్పంచ్ వన్నె రాజు, గ్రామ మాజీ కో ఆప్షన్ అజీమోద్దీన్, మంచాల శేఖర్, మహ్మద్ అజీమ్ పాల్గొన్నారు.

## 600 చదరపు అడుగులు మించిన ఇళ్లకు

# బిల్లులు నిలిపివేత

**వేద న్యూస్, హైదరాబాద్ :**




ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 400-600 చదరపు అడుగుల పరిధిలో ఇళ్లు నిర్మించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. 600 చదరపు అడుగులు మించిన ఇళ్లకు తాత్కాలికంగా బిల్లులు నిలిపివేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా కాంగ్రెస్ సర్కార్ మరో భారీ శుభవార్త చెప్పింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో ప్రభుత్వ నిబంధనలను ఏ ఒక్కరూ అతిక్రమించరాదని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరో సారి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఇళ్లు కనీసం 400 చదరపు అడుగుల నుంచి గరిష్టంగా 600 చదరపు అడుగుల పరిధిలో ఉండాలని ఆయన మరోసారి తెలియజేశారు. ఈ పరిమితులను మించకుండా నిర్మించిన వారికే ప్రభుత్వం బిల్లుల రూపంలో డబ్బులు వస్తాయని మంత్రి క్లారిటీ ఇచ్చారు.

పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మొదలు పెట్టామని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడ నమూనా ప్రాజెక్టు కింద ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పథకం అమలులో పారదర్శకతను, సమర్థతను చూపించే ఒక ప్రయత్నంలో భాగంగా ఇలా చేస్తున్నామన్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ప్రజలు ప్రభుత్వం వెల్లడించిన నియమాలు తెలియని కొందరు 600 చదరపు అడుగులు మించి ఇళ్లు నిర్మించుకోవడం మొదలు పెట్టారన్నారు.

అలాంటి ఇళ్లకు బిల్లులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, ఇకపై ఎవ్వరూ ఇలాంటి తప్పులు చేయవద్దని ఆదేశించారు. అయితే, ఇలా నిర్మించిన వారికి ఎలాంటి నష్టం కలగకుండా ఉండాలనే దృష్టితో బేస్మెంట్ వరకు పూర్తైన ఇళ్లకు ఈ ఒక్కసారికి మాత్రమే ప్రత్యేక మినహాయింపులో భాగంగా.. బేస్మెంట్ పూర్తి చేసిన ఒక్కో ఇంటికీ రూ. లక్ష చొప్పున విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. 600 చదరపు అడుగుల కంటే ఎక్కువగా నిర్మించిన ఇళ్ల సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా 300 వరకు ఉందని తెలిపారు.

ఈ తాత్కాలిక మినహాయింపు కేవలం బేస్మెంట్ వరకే వర్తిస్తుందని, ఇకపై జరిగే నిర్మాణం పూర్తిగా 400-600 చదరపు అడుగుల పరిధిలోనే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఇల్లు పూర్తిగా తయారవ్వాలంటే నిబంధనలకు అనుగుణంగా ఉండాలనేది తప్పనిసరి అని అన్నారు. లేదంటే మిగతా బిల్లులు మంజూరు కాదని, ఇంజినీర్లు కూడా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ తాత్కాలిక మినహాయింపు రాష్ట్రవ్యాప్తంగా అమలవదని, ఇది కేవలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామాలలో మాత్రమే వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. పథకాన్ని నియమ నిబంధనలతోపాటు, పేదల సంక్షేమం దృష్ట్యా కట్టుబడినట్లుగా రూపొందించామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో న్యాక్ ద్వారా శిక్షణ పొందిన 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. ప్రజల భద్రతకు సంబంధించి ఇంజినీర్లపై నమ్మకం ఉంచిన ప్రభుత్వం, వారి పనితీరులో పారదర్శకత, క్రమశిక్షణ అవసరమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిజమైన అర్హులైన పేదల కోసం మాత్రమే ఉద్దేశించబడిందని స్పష్టం చేశారు. పథకం అమలులో అవినీతికి అవకాశం లేకుండా ఉండేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో ప్రతి ఇంటిని ట్రాక్ చేస్తున్నామని వెల్లడించారు. నిర్మాణానికి సంబంధించి నాలుగు దశల్లో బిల్లులు చెల్లిస్తున్నామని, ప్రతి సోమవారం అర్హులైన లబ్ధిదారులకు బిల్లులు జమ చేయనున్నామని తెలిపారు. వర్క్ పూర్తయ్యే వరకూ ఎవరూ బిల్లుల కోసం సిఫార్సులు చేయరాదని మంత్రి స్పష్టం చేశారు. “ఇంతటివరకు ఎవరు ఒత్తిడి చేసినా, నేను మంత్రిగా ఫోన్ చేసినా కూడా పనులు పూర్తి కాకపోతే బిల్లులకు సిఫార్సు చేయకూడదు,” అంటూ ఆయన ఇంజినీర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఫేజ్ 1 నుంచి ఫేజ్ 4 దాకా ప్రతి దశను పూర్తిగా పరిశీలించి మాత్రమే సిఫార్సులు చేయాలని చెప్పారు.

## కార్మికులకు రూ.1,020 అలవెన్సు చెల్లించాలి

**వేద న్యూస్,ఎన్టీపీసీ ,జ్యోతి నగర్:**

ఎన్టీపీసీ టౌన్షిప్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.1,020 అలవెన్సు అందించాలని పెద్దపెల్లి జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గతంలో మెయింటెనెన్స్ అలవెన్సు అందించగా, గత 16 సంవత్సరాలుగా ఈ భత్యాన్ని అక్రమంగా నిలిపివేశారని ఆరోపించారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు మేనేజ్మెంట్ను కలిసినప్పటికీ, ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని సంఘం నేతలు తెలిపారు. ఇట్టి విషయం నాయకులు పై శనివారం రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడి) కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు.అదే విధంగా, గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను టెండర్ ప్రకారం కార్మికులను తగ్గిస్తున్నారు. కార్మికుల సేవలను గుర్తించి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని సంఘం కోరారు.ఈ రెండు డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే, ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని పెద్దపల్లి జిల్లా కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. సమ్మెకు జరిగే ప్రతిఫలం మొత్తానికి మేనేజ్మెంట్ బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్. బ్రాంచి కార్యదర్శి బుచ్చన్న. ఐఎఫ్టియు నాయకులు పి.స్వామి తదితరులు ఉన్నారు.

## నేడు చెస్ సెలక్షన్స్

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**



ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్ 7,9,15. బాల, బాలికలకు చెస్ సెలక్షన్స్ మే 4న నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, గండూరి కృపాకర్, ఎల్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ సెలక్షన్స్ అండర్ 7,9,15 బాల, బాలికలకు స్థానిక (టి.టి. డి) కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని హైదరాబాద్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు షీల్డ్స్,మెడల్స్ ప్రశంస పత్రాలు అందిఇస్తామని ఉచిత భోజన సదుపాయాలు కల్పిస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగం క్రీడాకారులు ఉపయోగించుకోవాలని వారు కోరారు వివరాలకు ఎల్ సతీష్ కుమార్ కార్యదర్శి, 9394753343 సంప్రదించాలని తెలిపారు.



## రహదారుల పరిశీలన

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ సన్ షైన్ వ్యాలీ కాలనీ లో బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. శనివారం నాడు ఆమె షన్ షేన్ వ్యాలి కాలనీనిలో కాలనీ వాసులతో కలిసి పర్యటించి రహదారులను పరిశీలించారు. ప్రజలకు రహదారులు అందుబాటులో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నేనావత్ బాలు నాయక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె కాలనీవాసులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రహదారులను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.



## సార్వత్రిక సమ్మె సైరన్

**వేద న్యూస్,దామరచర్ల :**

దామరచర్ల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లా కమిటీ సభ్యులు మే 20వ తారీకున జరిగే సార్వత్రిక సమ్మె సందర్భంగా శనివారం ఎంపీడీవో కి సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి దయానంద,గ్రామపంచాయతీ వర్కర్స్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే జహీర్, గ్రామపంచాయతీ మండల కార్యదర్శి సైదులు,కోశాధికారి ముదుసు సైదులు,ఉపాధ్యక్షులు గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## బిజెపిలో భారీ చేరికలు

**వేద న్యూస్, ఎన్ టి పి సి, జ్యోతి నగర్ :**

కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 100 మంది యువకులు, మహిళలు గోదావరిఖని మార్కండేయ కాలనీకీ చెందిన శిలారపు కళ్యాణ్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలోకి భారీగా చేరారు.వారికి బీజేపీ పార్టీ కండువాలు కప్పి పార్టీలో లో రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధికి యువత భాగస్వాములు కావడం శుభసంకేతమన్నారు. బీజేపీ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, పార్టీ విధానాలు యువతను ఆకర్షిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్ మండల బీజేపీ అధ్యక్షుడు కోడూరి రమేష్, నాయకులు జక్కన బాలు, జక్కుల ప్రవీణ్, పద్మ, అపర్ణ, ఇతర పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073